PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 168 | 22 మంగళవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# వైసీపీ డైరెక్షన్,,, టిడిపిలో యాక్షన్,,,





ఏపీ బ్యూరో,(ప్రజా సీమ)

ఇల్లు కాలి ఒకడు ఏడుస్తూ ఉంటే ఇంకేదో కావాలని మరొకరు ఏడుస్తున్నట్లు రాజంపేట టిడిపిలో వ్యవహారం నడుస్తుంది. గత కొన్నాళ్లుగా నాలుగు కార్యాలయాలుగా ఉన్న టిడిపి నేడు ఒక కార్యాలయానికి వచ్చి ఇప్పుడిప్పుడే ప్రజల్లో దూసుకెళ్తూ అటు అభివృద్ధి కార్యక్రమాలు, ఇటు సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి వక్కతాటిపై నిలిచి స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటూ గెలుపు దిశగా పయనిస్తున్న సమయంలో టిడిపిలో కొత్తగా దర్శనమిస్తున్న కొందరు చేస్తున్న హంగామా తో తిరిగి నాయకుల్లో కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉంది. ముఖ్యంగా రాజంపేట మున్సిపాలిటీ కి సంబంధించి చైర్మన్ రేసులో ఇప్పటివరకు ఎప్పుడు తెలుగుదేశం జెండాతో కనిపించని వారు, ఎప్పుడూ కార్యక్రమాల్లో పాల్గొన్నవారు, ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో కనిపించని వారు తమకు టికెట్ కేటాయించాలని కోరుతుండడంతో అసలు రాజంపేట టీడీపీలో ఏం జరుగుతుందా అని పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.

**ఇక్కడ మాట వేయాలి అక్కడ ఓటు వేయాలి,, కూటమిలో కుంపటి పెట్టడమే వారి లక్ష్యమా?**

## మేము ఏమి చెయ్యం,చైర్మెన్ కావాలి,,

టిడిపి అధికారంలోకి రాకముందు, అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ఎప్పుడు కనిపించని వారు కూడా నేడు చైర్మన్ పీఠం కోసం హంగామా చేయడం, పార్టీ పెద్దలతో పాటు ఇతర నాయకులను కలవడం పెద్ద ఎత్తున కనిపిస్తుంది. అయితే తెలుగుదేశం పార్టీ ఆఫీసులో కానీ, స్థానిక నాయకులు కార్యకర్తలతో కానీ ముఖ్యంగా రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజుతో కూడా వాళ్లు కలిసి ప్రయాణించకుండా కేవలం రాజంపేట తో సంబంధం లేని బయట నాయకులతో మంతనాలు జరుపుతూ టికెట్ కావాలని కోరడం చూస్తుంటే ఇదంతా టిడిపిలో గందరగోళ పరిస్థితులు నెలకొల్పి వైసీపీకి మేలు చేసేందుకే ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారని, ఒకవేళ తమకు టికెట్ ఇవ్వకపోతే ఏదో ఒక వివాదాన్ని రాజేసి తెలుగుదేశం పార్టీ అన్యాయం చేసిందని గగ్గోలు పెట్టడమే పనిగా పెట్టుకుని పక్కా ప్రణాళికతో టిడిపిలో ఉన్న కొంతమంది కోవర్టుల పథకం ప్రకారమే రోజుకు ఒక పేరు బయటికి తెస్తూ మున్సిపల్ ఎన్నికల్లో ఎలాగైనా టిడిపిని ఇబ్బందులు పాలు చేసేందుకు సామాజికపరంగా, ప్రాంత పరంగా విభజించి ఇబ్బందులు చేసేందుకే కోవర్టులు పనిచేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డైరెక్షన్ వైసీపీ లో, యాక్టింగ్ టిడిపిలో

తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశిస్తున్నా కొంతమంది ఆశావహులు వైసీపీతో పూర్తిస్థాయి ఒప్పందాలు కుదుర్చుకొని రంగంలోకి దిగుతున్నారని, ఒకవేళ తమకు టికెట్ దగ్గకపోయినా వైసీపీకి సహకరించినందుకు ముందే ఒప్పందం కుదుర్చుకొని మరి టిడిపిలో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. దీనికి తోడు స్థానిక క్యాడర్ ను, స్థానిక నాయకత్వాన్ని లెక్కలోకి వేసుకోకుండా కొంతమంది కేవలం అపాయింట్మెంట్లు తీసుకుంటూ మంత్రులను, జిల్లా అధ్యక్షులను, రాష్ట్ర అధ్యక్షులను కలుస్తూ తమకే టికెట్ వస్తుందని, అందరూ తమకు మద్దతు ఇవ్వాలని చెప్పుకోవడం చూస్తుంటే ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు పరిస్థితి తయారయింది. ఇటీవల ఒకాయన తనకు పెద్దల నుండి హామీ వచ్చిందని తానే చైర్మన్ అభ్యర్థిగా టిడిపి నుండి బరిలోకి దిగుతానని చెప్పుకుంటూ వినాయక చవితి సందర్భంగా విరాళాలు సమర్పించారని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే ఈయనకు తెలుగుదేశం కేడర్ నుండి గాని, స్థానిక నాయకత్వం నుండి గాని ఎటువంటి సంబంధాలు లేకపోయినా టికెట్ నాకే అని చెప్పుకోవడం చూసి పలువురు నవ్వుకుంటున్నారు. ఇలా ఒకరేమిటి ఇంట్లో కూర్చొని నేను తెలుగుదేశం నేతలని చెప్పుకున్న చాలా మంది నాయకులు నేడు చైర్మన్ పీఠం మాదే అంటూ తొడలు కొట్టడం చూస్తుంటే అనేక మంది కార్యకర్తలు నవ్వుకుంటున్నారు. మరి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి తో గాని, స్థానిక నాయకత్వంతో కానీ ఎటువంటి సత్సంబంధాలు లేని వారికి టిడిపిలో టికెట్ ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. మరి చూడాలి వైసిపి డైరెక్షన్లో టిడిపిలో నటిస్తున్న నాయకుల కు అధిష్టానం మంగళం వేస్తుందో లేక యాక్టింగ్ చూసి నచ్చక బయటికి తోచేస్తుందో.

### టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం.. మంత్రి లోకేశ్

# మాస్ వార్నింగ్...

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు



విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు.రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## వైసీపీ ఆందోళన నిరసన కాదు.. అరాచకం

- వైసీపీ నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్య బద్ధం కాదన్న బుద్దా వెంకన్న
- డీఎస్సీ ప్రక్రియపై జగన్ విషప్రచారం చేస్తున్నారని మండిపాటు
- డీఎస్సీ ఉద్యోగాలు దక్కడంతో నిరుద్యోగ యువత ఆనందంతో ఉందని వ్యాఖ్య



విజయవాడలో వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన ఎంతమాత్రం కాదని, అది నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అరాచక చర్య మాత్రమేనని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న మండిపడ్డారు.

# పార్టీ వద్దు,, భూములే ముద్దు...

**రూ.40 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా చేశారంటూ రిజిస్ట్రేషన్ డీజీ ఆఫీస్ ఎదుట జేసీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన**

- తాడిపత్రిలో వైసీపీ నేతలు భూ కబ్జా చేశారన్న జేసీ ప్రభాకర్ రెడ్డి
- ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు విఫలమయ్యారని మండిపాటు
- పెద్దారెడ్డి కూడా 2 సెంట్ల భూమి కబ్జా చేశారని ఆరోపణ








**పుల్లంపేట మండలంలో టిడిపి నాయకుల తీరు,, రోజు భూకబ్జాల ముచ్చటే,, పార్టీ బలోపేతంపై దృష్టి సారించరా?**

తిరుపతి జిల్లా బ్యూరో,(ప్రజా సీమ)

ఎవరైనా అధికారంలో ఉంటే తమ పార్టీని బలోపేతం చేసుకుంటూ, ప్రతిపక్ష పార్టీలను బలహీనపరుస్తూ రానున్న ఏ ఎన్నికలలో అయినా గెలిచేందుకు ముందుకు వెళ్తారు. ఇందుకు భిన్నంగా తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలో మాత్రం టిడిపి నాయకులు పార్టీ బలోపేతాన్ని రానున్న ఎన్నికల్లో పాటించాల్సిన వ్యూహాలను పక్కనపెట్టి ఎక్కడ భూములు కరిగిపోతాయని ప్రభుత్వ భూముల పై పడి ప్రతిరోజు ఆ భూముల గోల, కబ్జాల గోల తో తాము చదును చేసిన భూములను కాపాడుకునేందుకు మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తూ పార్టీని పక్కన పడేసారు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని కూడా ఒకరిద్దరు నేతలు నెత్తిన వేసుకొని నిర్వహించారు తప్ప ఎవ్వరు పార్టీ కార్యక్రమాలను కానీ ప్రభుత్వ కార్యక్రమాలను కానీ ముందుకు తీసుకు వెళుతున్న దాఖలాలు పుల్లంపేట మండలంలో కనిపించలేదని విమర్శలు వస్తున్నాయి. మండలంలో అనేకమంది నాయకులు భూములపై పెట్టిన శ్రద్ధ పార్టీపై గాని, ఎన్నికలపై కానీ పెట్టడం లేదనేది సర్వత్ర వినిపిస్తున్న విమర్శ.

## లోకల్ పట్టడం లేదా?

అతి త్వరలో జరగనున్న లోకల్ ఎలక్షన్లు ఇక్కడి నాయకులకు పట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. భూముల విషయంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం, ఎంతసేపు తాము పార్టీకి సేవ చేస్తున్నాం తాము ఈ భూములు చదును చేసాం, తమ జోలికి రావద్దని అధికారులకు చెప్పేందుకు మాత్రమే ఇక్కడి నాయకులు జోరుగా పనిచేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో కూడా పుల్లంపేట మండలంలో భూములు కబ్జా అయినా వారు తమ పార్టీని బలోపేతం చేసుకుంటూ, స్థానిక ఎన్నికల్లో నామినేషన్లు కూడా వెయ్యకుండా చేయగలిగిన పరిస్థితి ఉండేది. అయితే నేడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న, రైల్వే కోడూరు లో జనసేన ఎమ్మెల్యే తో పాటు కూటమి నాయకులు బలంగా ఉన్న మండలంలో పార్టీలను బలోపేతం చేసుకుని రానున్న ఎన్నికల్లో సత్తా చాటే ఎందుకు ఇక్కడ కూటమి నాయకులు ఏ మాత్రం ప్రయత్నించడం లేదంటే మరి రానున్న స్థానిక ఎన్నికలతో పాటు భవిష్యత్తులో వచ్చే ఏ ఎన్నికలలో అయినా ప్రతిపక్ష పార్టీకి అనుకూల వాతావరణాన్ని తమ చేతులారా కూటమి నాయకులు నెలకొల్పుతున్నారు అనే విమర్శలు వస్తున్నాయి. మరి చూడాలి నియోజకవర్గ నాయకులైన పుల్లంపేట పై శ్రద్ధ పెట్టి ఒకరిద్దరు కాకుండా అందరూ వారి వారి గ్రామాలలో రాబోయే ఎన్నికలపై దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని అలా కాకుండా భూములపై దృష్టి సారించి పార్టీని నిర్లక్ష్యం చేస్తే పెత్తనం చేసేందుకు మరోసారి అవకాశం దక్కలని ఆలోచన కూటమి నాయకులలో రావాలని పలువురు కోరుతున్నారు.

# విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత.. టీచర్లు వర్సెస్ వైసీపీ.. తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

మొదటిపేజీ తరువాయి

. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

### వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# కేంద్రంపై శశిథరూర్ ఫైర్...

మొదటిపేజీ తరువాయి

ఈ అంశంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు 'ఎక్స్' వేదికగా శశిథరూర్ ఒక విజ్ఞప్తి చేశారు. అధికారుల నిర్ణయాన్ని పక్కనపెట్టి, సదరు చిత్రాలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇటువంటి చర్యల వల్ల అంతర్జాతీయ స్థాయిలో సృజనాత్మక కళాకారులు, చిత్రనిర్మాతల దృష్టిలో భారత ప్రతిష్ఠ మసకబారుతుందని ఆయన హెచ్చరించారు.తిరువనంతపురంలో సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది. నిర్వాహకులైన కేరళ రాష్ట్ర చలనచిత్ర అకాడమీ మొత్తం 347 చిత్రాలను పరిశీలన కోసం పంపగా, కేంద్రం 31 చిత్రాలకు మినహాయింపును నిలిపివేసింది. వీటిలో రాజకీయ అసమ్మతి, కుల వివక్ష, గాజా సంక్షోభం, ఇరాన్ నిరసనలు వంటి అంశాల నేపథ్యంగా రూపొందించిన చిత్రాలు ఉన్నాయి. తిరస్కరించిన వాటిలో అట్టప్పాడి గిరిజనుల జీవితంపై తీసిన 'గ్లోబ్' అనే మలయాళ చిత్రం కూడా ఉండటం గమనార్హం.కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం చలనచిత్ర ఉత్సవాల నిర్వహణ స్వేచ్ఛను హరించడమేనని కేరళ సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విష్ణునాథ్ విమర్శించారు. మరోవైపు, చలనచిత్ర అకాడమీ ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఇప్పటికే జ్యూరీ సభ్యులు, చిత్రనిర్మాతలు ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారని, స్క్రీనింగ్ ఫీజులు కూడా చెల్లించామని అకాడమీ స్పష్టం చేసింది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల ఫెస్టివల్ షెడ్యూల్ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

# కుప్పంలో సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన.. వందల కోట్ల పనులకు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష.. రైతులకు సీఎం పిలుపు అనంతరం 'స్వర్ణ కుప్పం' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబు, పలువురు లబ్ధిదారులతో నేరుగా సంభాషించారు. హంద్రీనీవా కాలువ ద్వారా లబ్ధి పొందిన రైతుతో మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు. "వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే ఎల్ నినో వంటి పరిస్థితులు ఏర్పడి వర్షాభావం నెలకొంది. దీనివల్ల కృష్ణా, గోదావరి నదులకు నీరు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సేంద్రీయ ఎరువులు, బయోచార్ వంటి విధానాలతో భూసారాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం. ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అనే విధానాన్ని పాటిద్దాం" అని రైతులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుదామని అన్నారు. భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచిస్తూ, కరవు నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త ఈ సందర్భంగా పీ4 కార్యక్రమం కింద లబ్ధి పొందిన లక్ష్మి అనే మహిళ తన అనుభవాలను పంచుకున్నారు. ప్రభుత్వం, టీవీఎస్ సంస్థ సహకారంతో ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తగా మారానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. "ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు. టీవీఎస్, అదానీ, మెగా వంటి సంస్థలు 8900 కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా నిలబెడుతున్నాయని అభినందించారు. అలాగే, కుప్పంలోని ఓ కంపెనీలో ఉద్యోగం పొందిన సురేఖ అనే యువతిని అభినందిస్తూ, ప్రతి కుటుంబంలోనూ స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని ఆకాంక్షించారు.

# లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన...

మొదటిపేజీ తరువాయి

స్థానిక వ్యాపారవేత్తలతో సమావేశమై, వారి వ్యాపార విస్తరణకు పన్ను మినహాయింపులు వంటి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే, దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల నుంచి కూడా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.సీఎం విజయ్ ఆరు రోజుల యూకే పర్యటన ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 10,000కు పైగా ఉద్యోగాలు లభించాయని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అన్నామలై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి పనిచేయడానికి కొంత సమయం ఇవ్వాలని చెబుతూనే, స్థానిక పరిశ్రమల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

# యూట్యూబర్ నందన దంపతులపై ప్రజావాణిలో ఫిర్యాదు

- యూట్యూబర్ నందన దంపతులపై ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు
- యూకేలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపణ
- ఒక్కొక్కరి నుంచి రూ.25 లక్షల నుంచి రూ.95 లక్షల వరకు వసూలు
- నకిలీ పత్రాలతో వీసాలు ఇప్పించారని బాధితుల ఆవేదన
- విషయాన్ని డీజీపీ, ఈడీ దృష్టికి తీసుకెళతామని అధికారుల హామీ

యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసి మోసగించినట్లు యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్‌లపై ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ మేరకు బాధితులు సోమవారం ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

### బాధితుల కథనం ప్రకారం..

యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీకి ఉద్యోగులు నియామక ప్రక్రియ కోసం అనుమతులు మంజూరు చేసిందని నందన, మధుకర్ దంపతులు నమ్మబలికారు. ప్రధానంగా స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లి, వీసా గడువు ముగియనున్న వారిని లక్ష్యంగా చేసుకుని వర్క్ వీసాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 95 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. అయితే, సదరు కన్సల్టెన్సీ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలడంతో యూకే ప్రభుత్వం తమపై కఠిన చర్యలు తీసుకుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారని వారు వివరించారు.సోమవారం బేగంపేటలోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బాధితులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్‌పర్సన్, ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల విజయలక్ష్మి, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్నారై సలహా కమిటీ ఛైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్‌లను కలిసి తమ సమస్యను విన్నవించారు. వారి నుంచి ఫిర్యాదును స్వీకరించిన అధికారులు, ఈ ఉదంతాన్ని రాష్ట్ర డీజీపీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికి తీసుకెళ్లి, పూర్తిస్థాయి దర్యాప్తునకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది.ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వైసీపీ ఆందోళన నిరసన కాదు.. అరాచకం

మొదటిపేజీ తరువాయి

పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ ప్రజల్లో కావాలని విషప్రచారం చేస్తున్నారని, అయితే ఆయన అబద్ధాలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని స్పష్టం చేశారు. ఎటువంటి పక్షపాతానికి తావులేకుండా అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని తేల్చిచెప్పారు.ప్రత్యేకించి స్పోర్ట్స్ కోటా కింద అర్హత సాధించిన క్రీడాకారులకు పారదర్శకంగా డీఎస్సీ ఉద్యోగాలు దక్కడంతో నిరుద్యోగ యువత ఎంతో ఆనందంతో ఉందని బుద్ధా వెంకన్న తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువత భద్రతకు, ఉపాధి కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుంటే, అర్హులైన క్రీడాకారులకు న్యాయం జరగడాన్ని కూడా వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో సంచలనాత్మక మార్పులు తీసుకొస్తూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందిస్తున్న మంత్రి నారా లోకేశ్ పై ఉన్న రాజకీయ అసూయతోనే వైసీపీ ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు ఒడిగడుతోందని, ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలను ప్రజలే స్వయంగా తిప్పికొడతారని హెచ్చరించారు.

# రూ.40 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా చేశారంటూ రిజిస్ట్రేషన్ డీజీ ఆఫీస్ ఎదుట జేసీ ప్రభాకర్ రెడ్డి ఆందోళన

మొదటిపేజీ తరువాయి

అనంతపురం జిల్లా తాడిపత్రిలో సుమారు రూ. 40 కోట్ల విలువైన విలువైన ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు అక్రమంగా కాజేశారని టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలంటూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీజీ కార్యాలయం ఎదుట ఆయన ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ బసవరాజు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని, ఆయనతో పాటు దీనికి సహకరించిన బాధ్యులైన అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ హయాంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా 2 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఇల్లు నిర్మించుకున్నారని, ఆధారాలున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ భూ వివాదం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రాథమిక విచారణ జరిపి డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, వీఆర్ఓ వెంకటస్వామితో పాటు జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ షఫీలను సస్పెండ్ చేస్తూ సంచలన ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# బేగంపేటలో భారీ చోరీ.. 81 తులాల బంగారం, నగదు అపహరణ

- 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు అపహరణ - ఇంట్లో పనిచేసే సిబ్బందిపైనే అనుమానం

- ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

హైదరాబాద్‌లోని బేగంపేటలో భారీ చోరీ చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమానగర్‌లో నివసిస్తున్న శ్రీనాథ్ నాయుడు అనే వ్యక్తి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే, శ్రీనాథ్ నాయుడు కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని అల్మారాలో దాచిన నగదు, నగలు మాయమైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనాథ్ నాయుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ఆహ్లాదం.. ఆరోగ్య నిలయాలుగా గ్రామీణ చెరువులు









## ఫక్రుద్దీన్ పాలెం మైసమ్మ చెరువును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పిఠాపురం: (ప్రజా సీమ )

గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించే సామాజిక వేదికలుగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం ఫకృద్దీన్ పాలెంలో రూ.73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ పార్కును సోమవారం ఆయన ప్రారంభించారు. మైసమ్మ చెరువును మోడల్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి, చెరువు గట్టును బలోపేతం చేయడంతో పాటు పచ్చదనం సాయంత్రం వేళల్లో నడక సాగించేందుకు వాకింగ్ ట్రాక్, మహిళలు, యువత, వృద్ధులు వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేశారు. జాతీయ భావన పెంపొందించేలా జెండా స్థూపాన్ని, చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించిన పవన్ కళ్యాణ్.. పార్కులోని సౌకర్యాలను పరిశీలించారు. అక్కడ ఆడుకుంటున్న చిన్నారులకు తినుబండారాలు, చాక్లెట్లు అందించారు. అనంతరం చెరువు గట్టు వెంబడి నడుస్తూ అక్కడి భారీ వృక్షాల వయసు, శాస్త్రీయ నామాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న 11 చెరువులకు సంబంధించిన శిలాఫలాన్ని ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన కూడా ఆయన సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (గ్రావీఖ్) సహకారంతో రూ.50 కోట్ల వ్యయంతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చెరువు ప్రారంభోత్సవానికి ముందు గట్టుపై ఉన్న మైసమ్మ ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు మధ్య భాగంలో నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఫకృద్దీన్ పాలెంలోని వినాయకుడి ఆలయాన్ని కూడా సందర్శించారు. చెరువు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ సచివాలయ భవనం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త కోసం ఏర్పాటు చేసిన కుండీలను పరిశీలించి పారిశుధ్య నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులను పలకరించి వారితో ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, బీజేపీ నాయకులు కృష్ణంరాజు, ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్, పీడీ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పచ్చదన పరిమళం.. పీఠికాపురవనం ఆవిష్కారం

## రూ.1.83 కోట్లతో ఆరు ఎకరాల్లో నగరవనం

## అభివృద్ధి - ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభం









పిఠాపురం: (ప్రజా సీమ )

పిఠాపురం పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన "పీఠికాపురవనం" నగరవనం ప్రారంభమైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ సోమవారం నగరవనంలో మొక్క నాటి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి నగరవనాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం కింద సుమారు రూ. 1.83 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఈ నగరవనాన్ని అభివృద్ధి చేశారు. గతంలో డంపింగ్ యార్డుగా, అపరిశుభ్రతకు నిలయంగా ఉన్న ప్రాంతం ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే నగరవనంగా రూపుదిద్దుకుంది. ఆధ్యాత్మికతకు ప్రతీకగా నక్షత్రవనంపిఠాపురానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నగరవనాన్ని ఆహ్లాదం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా తీర్చిదిద్దారు. నక్షత్రవనం, శివపంచాయతన వనం సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 27 నక్షత్రాలకు ప్రతీకగా ఉసిరి, మేడి, మోదుగ, కొండమామిడి, పిప్పులి, వెదురు, రావి, మర్రి, జాతి జువ్వి, దేవదారు, జిల్లేడు, జమ్మి, వేప తదితర మొక్కలను క్రమపద్ధతిలో నాటారు. ప్రతి మొక్కకు శాస్త్రీయ నామంతో పాటు వాడుకలో ఉన్న పేరును సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు. శివస్వరూపమైన మారేడు, వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగవానుడి స్వరూపాలకు ప్రతీకలుగా మొక్కలను ఏర్పాటు చేసి శివపంచాయతన వనం రూపొందించారు. మియావకీ ఫారెస్ట్ ప్రత్యేక ఆకర్షణనగరవనంలో 70 సెంట్ల విస్తీర్ణంలో మియావకీ పద్ధతిలో చిట్టడవిని అభివృద్ధి చేశారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సంఖ్యలో మొక్కలను పెంచి వేగంగా పచ్చదనాన్ని పెంపొందించే విధంగా ఈ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే బటర్‌ఫ్లై పార్క్, భారీ కొలను వంటి ఆకర్షణలను కూడా అభివృద్ధి చేశారు. భవిష్యత్తులో బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ తదితర సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నగరవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్ది పిఠాపురం ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మిక సందర్శనకు వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. అధికారులకు అభినందనలుగతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రదేశం నుంచి నగరవనంగా ఎలా రూపాంతరం చెందిందో తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పవన్ కళ్యాణ్ పరిశీలించారు. పీఠికాపురవనం అభివృద్ధికి కృషి చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం సహకారంతో రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో నగరవనాలను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.36 కోట్ల వ్యయంతో 18 నగరవనాలను ఇప్పటికే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, కౌడా ఛైర్మన్ తలాటం సత్య, అటవీశాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు, పడా పీడీ శివరాం ప్రసాద్, సీసీఎఫ్ జ్యోతి, కాకినాడ డీఎఫ్ఓ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లెలో సైనిక సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలి

## - మాజీ సైనికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### - డిఫెన్స్ వెటర్న్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె నందు మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు,డిఫెన్స్ వెటర్న్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెకి జిల్లా పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చెప్పడం చాలా సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ 2023లో అల్లూరు జిల్లాలో పని చేసిన సమయంలో కలెక్టరుకు రాష్ట్రపతి అవార్డు రావడం జరిగిందని,అన్నమయ్య జిల్లా ఏర్పటై మూడు సంవత్సరాలు అవుతోందని మదనపల్లెను జిల్లా కేంద్రంగా మార్చి ఏడాది అవుతున్న అన్నమయ్య జిల్లాలో మాజీ సైనికులకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం,ఈసిహెచ్ఎస్ హాస్పిటల్,సి.ఎస్.డి క్యాంటీన్ ఏర్పాటు చేయ వలసిన బాధ్యత జిల్లా కలెక్టరుపై ఉందని గుర్తుచేశారు. ఇందుకు మదనపల్లెలో చాలా భవనాలు ఖాళీగా ఉన్నాయని కావున కలెక్టర్ చొరవ చూపి కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. పీలేరు,రాయచోటి,మదనపల్లెలో దాదాపు 2 వేల మంది మాజీ సైనికులు ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు చాలా ఉన్నా యిని అయితే మాజీ సైనికులకు ప్రభుత్వ పథకాలలో ఎక్కడ చోటు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రూరల్,అర్బనులో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని,మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కోసం ప్రత్యేక ఆప్షన్ ఇచ్చి దరఖాస్తూ చేసుకొనే అవకాశం ఇవ్వాలని కోరారు. దేశం కోసం సేవ చేస్తున్న సైనికులపైన,వారి కుటుంబ సభ్యులపై దాడులు జరుగుతున్నాయని దీనిపై ప్రజలు,రెవెన్యూ,పోలీసు అధికారులు సైనికులపై జాలి చూపాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి లోకేష్ మాజీ సైనికుల సమస్యలను ఆలకించాలని వేడు కున్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె మాజీ సైనికుల సంఘం వైస్ ప్రెసిడెంట్ వెంకట రమణారెడ్డి,సుబేదార్ నూరు మొహమ్మద్,సెక్రెటరీ సుబ్బ రాయుడు,హవల్దార్ ప్రకాష్ నాయుడు,నాయక్,చంద్రశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.




# రికార్డ్ ధర పలికిన దేవతా నగర్ విఘ్నేశ్వరుడి లడ్డు

## - రూ.2.02 లక్షలకు దక్కించుకున్న దారం పుల్లయ్య యాదవ్

## - అంగరంగ వైభవంగా సాగిన గణేశుడి నిమజ్జనోత్సవం

మదనపల్లె (ప్రజా సీమ) :

దేవతానగర్‌లో కొలువుదీరిన గణనాథుడి లడ్డూకు భక్తులు భారీ ధర చెల్లించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేలంపాటలో లడ్డూ రికార్డ్ స్థాయిలో ఏకంగా రూ. 2,02,116కు వేలం పలికింది. గత ఏడాది ఇదే లడ్డూ రూ. 23,000కు వేలం వెళ్లగా ఈసారి దాదాపు తొమ్మిది రెట్లు అధిక ధర పలకడం విశేషం. గణనాథుడిపై భక్తుల విశ్వాసానికి ఈ వేలం నిదర్శనంగా నిలిచింది. భక్తుల పోటాపోటీగా వేలంపాటలో లడ్డూతో పాటు గణేశుడికి సంబంధించిన కాయిన్,కండువాలకు కూడా భక్తులు పోటీపడ్డారు. ఈ వేలం పాటలలో చివరకు దారం పుల్లయ్య యాదవ్ లడ్డును రూ. 2,02,116/–లకు,అను మల హితీష్ కాయిన్ ను రూ. 40,001/–లకు,పి. యశ్వంత్ శర్మ కండువాను రూ. 5,100/–లకు దక్కించుకున్నారు. దీంతో దేవతానగర్ గణేశ్ ఉత్సవాల్లో వేలంపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అంగరంగ వైభవంగా నిమజ్జన కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో దేవతా నగర్ యూత్ సభ్యులు యస్. అజయ్ కుమార్,యస్. విజయ్ కుమార్,నీహార్,పి. జయశ్రీ,ఎం. బినీత,గురు చరణ్ సుశాంత్ (సన్నీ),గణేష్ (సన్నీ),చరణ్,చిరుదీప్,పెద్దఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.



# శబరగిరీశుడికి ఇరుముడి చెల్లించిన శ్రీరామ్ చినబాబు

## - యోగేశ్వర్ బాబుతో కలిసి సన్నిధానంలో పూజలు

మదనపల్లె (ప్రజా సీమ) :



మండల దీక్షను పూర్తి చేసిన అనంతరం సోమవారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు అయ్యప్ప స్వామికి ఇరుముడి చెల్లించారు. తన సోదరుడు యోగేశ్వర బాబు (పెద్దబాబు)తో కలిసి సన్నిధానంలో స్వామివారి ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో నియమనిష్టలతో కూడుకున్నదన్నారు. మణికంఠుడి ఆశీస్సులతో అయ్యప్ప దీక్ష ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేసుకోవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. శబరిమల సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. అయ్యప్ప ఆశీస్సులతో ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని,వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా మారాలని ఆకాంక్షించారు. చినబాబుతోపాటు టీడీపీ సీనియర్ నాయకులు యాలగిరి దొరస్వామి నాయుడు,కురవంక శంకర,తెలుగు యువత నాయకులు ప్రవీణ్ రాయల్,పవన్,వినోద్ పాల్గొన్నారు.



# గురజాడ నవయుగ వైతాళికుడు

## - ఏపిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి

**వేంపల్లె ప్రజాసీమ:**

గురజాడ అప్పారావు అభ్యుదయ కవితా పితామహుడు, నవయుగ వైతాళికుడు అని ఏపిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి కొనియాడారు. గురజాడ అప్పారావు 164వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ దేశమంటే మట్టికాదయ్, దేశమంటే మనుషులోయ్ అని సమాజానికి గొప్ప సందేశాన్ని అందించిన దేశ భక్తుడు, సంఘసంస్కర్త గురజాడ అన్నారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం తదితర సాంఘీక దురాచారాలను నిర్మించేందుకు ఆయన సాహిత్యాన్ని, వాడుక భాషని ప్రయోగించరాని వెల్లడించారు. పుత్తడిబొమ్మ, పూర్ణమ్మ, ముత్యాల సరాలు, సుభద్ర, నిలగిరి కోటలు గురజాడ ప్రతిభకు ఆనవాలని తెలిపారు. గురజాడ అడుగు జాడలు ప్రగతికి మైలురాల్లని వివరించారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, బద్రీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# పీఎం కిసాన్ లబ్ధిదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి

## సెప్టెంబర్ 30లోపు పూర్తి చేసుకోకపోతే ఆర్థిక సాయం నిలిచే అవకాశం: వ్యవసాయ అధికారి ఎస్. ప్రవీణ్

**పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:**



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని పుల్లంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్. ప్రవీణ్ సూచించారు. తదుపరి విడత ఆర్థిక సాయం పొందేందుకు ఈ-కేవైసీ తప్పనిసరి కావడంతో రైతులు గడువు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.మండలంలో ఇప్పటివరకు 4,177 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. సంబంధిత రైతులు 2026 సెప్టెంబర్ 30లోపు ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే పీఎం కిసాన్ పథకం కింద అందే ఆర్థిక ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీపంలోని రైతు సేవా కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్లు ను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువు లోపు నమోదు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు.

# మదనపల్లె వన్‌టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన మోహన్ కుమార్

## - శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ అధికారులు,సిబ్బంది

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా,మదనపల్లె డివిజనులో పలువురు సిఐలు బదిలీ అయినా సంగతి విధితమే.బదిలీ అయిన సీఐలు సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు.అందులో భాగంగా మదనపల్లె వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో నేరాల నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తామన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని ఆయన తెలిపారు.జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచనలు పాటించి పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా విధులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా సీఐ వెల్లడించారు.కాగా నూతన సిఐకి పలువురు పోలీస్ అధికారులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.




# శ్రీ శ్రీ శ్రీ నిత్య పూజ స్వామి కోనలో హుండీలు లెక్కింపు

**సిద్ధవటం ప్రజాసీమ**



కడప జిల్లా సిద్ధవటం మండలం వంతాటి పల్లె గ్రామపంచాయతీ సమీపాన అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజ స్వామి కోనలో సోమవారం ఉదయం హుండీలను లెక్కించగా 57,841/-ఆదాయం వచ్చినది.(ఈ ఆదాయం 10.08.2026 నుండి 21.09.2026 వరకు) ఈ కార్యక్రమం లో రాజంపేట ఇన్స్పెక్టర్ ఎస్ జనార్దన్ ఆలయ కార్యనిర్వహణాధికారి పి. సురేష్ కుమార్ రెడ్డి, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి జె.రాజేంద్ర ప్రసాద్, ఆలయ అర్చకులు సుబ్రమణ్యం శర్మ, సిబ్బంది చంద్ర,వంతాటి పల్లి గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

# కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి పట్టువస్త్రాల సమర్పణ









**కాణిపాకం,(ప్రజా సీమ)**

కాణిపాకంలో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరిం చుకుని శ్రీశైల దేవస్థానం తరుపున సోమవారం పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభమైన కాణిపాక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4వ తేదీన ముగియనున్నాయి. ఈ మేరకు శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు జి. లక్ష్మేశ్వరి, జిల్లెల శ్రీదేవి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, వాయిగండ్ల వెంకటేశ్వర్లు, ఆకుల శ్రీనివాసులు, అర్చకులు, వేదపండితులు, పలువురు అధికారులు, తదితరులు ఈ పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమములో పూతలపట్టు నియోజకవర్గం శాసనసభ్యులు డా. కె. మురళీమోహన్, కాణిపాక దేవస్థాన ధర్మకర్తల మండలి వి. సురేంద్రబాబు, కార్యనిర్వహణాధికారి కె.పెంచలకిషోర్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. అనంతరం ఈ దేవస్థానం అధ్యక్షులను, ధర్మకర్తల మండలి సభ్యులను, అధికారులను, అర్చకస్వాములు, వేదపండితులు వేదాశీర్వచనముతో సత్కరించారు. కాగా ఆలయం సంస్కృతి సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిసంవత్సరం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల సమయములో శ్రీశైల దేవస్థానం తరపున ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరుగుతోంది.

# ఉపాధ్యాయులపై దాడి బాధాకరం,,

## ఉనికి కోసం దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి,,

**రాజంపేట, (ప్రజా సీమ)**



ఉపాధ్యాయులపై దాడులు చేస్తూ, ఉనికి కోసం వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, డీఎస్సీలో అక్రమాలు జరిగితే కోర్టులను ఆశ్రయించి న్యాయపరంగా పోరాడవచ్చు అని, అలా కాకుండా దాడులకు దిగడం వైసిపి నిజస్వరూపాన్ని బయటపెడుతుందని టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారంశాప్ కార్యాలయం వద్ద వైసీపీ నేతల అల్లర్లను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేవినేని అవినాష్,మాజీమంత్రి జోగి రమేష్ రౌడీ గ్యాంగ్ తో శాప్ కార్యాలయం వద్ద రాళ్ళు,కోడిగుడ్లతో అల్లర్లకు పాల్పడిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్య అని,డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై దౌర్జన్యం చేయడం దుర్మార్గం అని,కష్టపడి ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు,ఉపాధ్యాయులను అవమానించడం సరికాదనీ,ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదనీ,శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వ కార్యాలయం వద్ద వైకాపా ఉద్రిక్తత సృష్టించడం తగదనీ,ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లు,దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదనీ,ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం వైకాపా నేతల విజ్ఞతకే వదిలేస్తున్నాం అని, ఉనికి కోసం ఇలాంటి చర్యలకు పాల్పడితే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాలని ఆయన తెలియజేశారు.

# అట్టహాసంగా దమ్99 బిర్యానీ రెస్టారెంట్ ప్రారంభం

## - హాజరైన తెలుగుదేశం యువనేత జునైద్ అక్బరీ





**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని నీరుగట్టువారిపల్లి,కదిరి రోడ్డు నందు అల్తాఫ్,ఇర్షాద్ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దమ్99 బిర్యానీ నూతన రెస్టారెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు,టిడిపి యువ నాయకులు జునైద్ అక్బరీ హాజరయ్యారు.ఈ సందర్భంగా జునైద్ అక్బరీ మాట్లాడుతూ మదనపల్లెలోని బిర్యానీ ప్రేమికులకు మరో శుభవార్త అని,దమ్99 బిర్యానీ రెస్టారెంట్ నందు రూ.99కే రుచికరమైన ధమ్ బిర్యానీ అందిస్తున్నారన్నారు.అత్యంత అనుభవంగా కలిగిన అల్తాఫ్,ఇర్షాద్ సోదరులు ఈ రెస్టారెంట్ ఓపెన్ చేయడం శుభపరిణామమన్నారు.బిర్యానీ రుచి చాలా అద్భుతంగా ఉందని,మాంసాహార ప్రియులు ఈ రెస్టారెంట్ ను సందర్శించి తమకి ఇష్టమైన బిర్యానీ ఆరగించాలని సూచించారు.అనంతరం నిర్వహకులు అల్తాఫ్,ఇర్షాద్ మాట్లాడుతూ మా రెస్టారెంట్ నందు రూ.99 రూపాయలకే అన్ లిమిటెడ్ బిర్యానీ అందిస్తున్నా మన్నారు.పట్టణ ప్రజలకు నాణ్యమైన,రుచికరమైన బిర్యాని అందించడమే మా లక్ష్యమన్నారు.మా ఆహ్వానం మేరకు రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన జునైద్ అక్బరీ మరియు ఇతరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముసలికుంట నాగయ్య,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగ చిన్నారులకు సహాయ పరికరాలు, మెటీరియల్స్ పంపిణీ

## - వీటిని చక్కగా సద్వినియోగం చేసుకోవాలి

### - ఐఇ కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య

**వేంపల్లె ప్రజాసీమ:**



స్థానిక భవిత దివ్యాంగ కేంద్రంలోని చిన్నారులకు అలింకో సంస్థ ఆధ్వర్యంలో సహాయ పరికరాలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ కిట్లు పంపిణీ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా ఐఇ కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య, స్థానిక ఎంఇఓ వెంకట్రామిరెడ్డి హాజరై వీరి చేతుల మీదుగా దివ్యాంగ చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను దృష్టిలో ఉంచుకుని వీరికి అణుగుణంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తో పాటు సహాయ పరికరాలు అందజేయడం జరిగిందన్నారు. వీటిని చక్కగా సద్వినియోగం చేసుకుని విద్యా భ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని ప్రోత్సాహించారు. గతేడాది నవంబర్ 22న మెడికల్ అసెస్మెంట్ శిబిరంలో భవిత కేంద్రానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వైద్యులు విద్యార్థులను పరిశీలించి, అవసరాలను గుర్తించి ఎంఆర్ కిట్ల కోసం రెఫర్ చేశారు. వైద్యుల సూచనల మేరకు అందుబాటులోకి వచ్చిన కిట్లు పంపిణీ చేసినట్లు భవిత కేంద్రం ఐఇఆర్టీ యశోద వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, ఉర్దూ పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఐఇఆర్టీ సుజాత, సిజీవి సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# వైభవోపేతంగా రామారావు కాలనీ గణనాధుడి నిమజ్జనోత్సవం

## - ముఖ్యఅతిథిగా హాజరైన చేనేత నాయకులు పురుం సహదేవ

## - ఉత్సాహంగా పాల్గొన్న చేనేత కార్మికులు,యువత





మదనపల్లె (ప్రజా సీమ) :

రామారావు కాలనీ,3వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనోత్సవం ఆదివారం శోభయమానంగా జరిగింది.ఈ వేడుకలకు చేనేత కార్మిక నాయకుడు పురుం సహదేవ ఆయన సతీమణి గాయత్రిలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పురుం సహదేవ మాట్లాడుతూ ప్రతి ఏడాది మూడో వార్డు పరిధిలో గణేష్ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు.అదేవిధంగా ఈ ఏడాది సైతం ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు .ప్రజలంతా ఆధ్యాత్మికత,భక్తిభావాన్ని పెంపొందించు కోవాలని తద్వారా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.మన పూర్వీకులు అందించిన ఆచార సాంప్రదాయాలను కొనసాగిద్దామన్నారు.గణనాధుడి ఆశీస్సులతో చేనేత రంగం గొప్ప పురోగతి సాధించాలని,చేనేత కార్మికుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా చేనేత కార్మికులు,భక్తులు, ప్రజలకు పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ గావించారు.పురవీధుల్లో గణపతి బప్పా మోరియా,జై బోలో గణేష్ మహరాజ్ కి జై నినాదాలు,నృత్యాలతో స్వామివారి ఊరేగింపు కన్నుల పండుగలా సాగింది.అనంతరం సిటిఎం చెరువులో వినాయకుడి నిమజ్జనంతో కార్యక్రమం పరిపూర్ణమైంది.రమేష్,రెడ్డెమ్మ, సుజాత,చౌడయ్య,రాధమ్మ,సుచిత్ర,పవిత్ర,రాఘవ,హర్షవర్ధన్ రెడ్డి,జశ్వంత్,నన్నీ,స్వీటి,వెంకటేష్, నిఖిల్,సుధాకర,పద్మావతి,ఆనంద్,సాయిరాం వీధి వెంకట నాగలు,వీవర్స్ కాలనీ తరిగొండ శేఖర్,పుల్లయ్య ,గజ్జలకుంట బాలు,శీను ,గాలివీడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

# గురజాడ సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయకం

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కితాబు

మదనపల్లె (ప్రజా సీమ) :

ఆధునిక తెలుగు సాహిత్యానికి కొత్త దిశానిర్దేశం చేసిన మహాకవి,సంఘసంస్కర్త గురజాడ వెంకట అప్పారావు ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు.గురజాడ అప్పారావు జయంతి వేడుకలను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ,యువజన సర్వీసుల శాఖ స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.కలెక్టర్,డిఆర్ఓ వెంకటేశు ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలు గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి,పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ1862 సెప్టెంబరు 21న జన్మించిన గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా,ప్రముఖ సంఘ సంస్కర్తగా,మహాకవిగా గుర్తింపు పొందారన్నారు.గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. బాల్యవివాహాలు,కన్యాశుల్కం వంటి సామాజిక దురాచారాలను ఆయన తన రచనల ద్వారా ప్రశ్నించారని తెలిపారు.ప్రజలకు అర్థమయ్యే వ్యావహారిక భాషలో రచనలు చేసి తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. దేశమును ప్రేమించుమన్నా వంటి దేశభక్తి గేయాల ద్వారా ప్రజల్లో దేశభక్తి,సామాజిక బాధ్యతను పెంపొందించారని తెలిపారు.దేశమంటే మట్టి కాదోయ్,దేశమంటే మనుషులోయ్ అనే సందేశం మానవతా విలువలను చాటుతుందన్నారు.ముత్యాల సరాలు ద్వారా తెలుగు కవిత్వంలో కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారని,సమాజ శ్రేయస్సు,స్త్రీ విద్య,మానవతా విలువల కోసం గురజాడ చేసిన కృషి చిరస్మరణీయమని కలెక్టర్ పేర్కొన్నారు.సొంత లాభం కొంత మానుకో,పొరుగువానికి తోడుపడవోయ్ అనే సందేశం సమాజం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేస్తుందని తెలిపారు.గురజాడ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజపు అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం,యువజన సర్వీసుల శాఖ పర్యవేక్షణ అధికారి వి.వి.నారాయణ,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సేలం నగరంలో జాతీయ స్థాయి టెక్‌ఫినిక్స్-2026 సదస్సు

## - సత్తాచాటిన మిట్స్ యూనివర్శిటీ విద్యార్థులు



మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు తమిళనాడులోని సేలం,పావై ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టెక్‌ఫినిక్స్-2026 జాతీయస్థాయి సాంకేతిక సదస్సులో పాల్గొని ప్రతిభ కనబరిచారని వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.ఈ సదస్సులో ఏఐ టూల్స్‌ను ఉపయోగించి మోడల్ బిల్డింగుకు సంబంధించిన పోటీలలో మిట్స్ విద్యార్థులు ప్రత్యేక ప్రతిభను చాటారు.వాల్ట్ ఏఐ అంశంపై నిర్వహించిన పేపర్ ప్రజెంటేషన్ పోటీలో సి.ఎస్.ఈ మూడవ సంవత్సరం చదువుతున్న ఎన్.అష్రఫ్ వలి,బి.సాత్విక్ మరియు రెండవ సంవత్సరం చదువుతున్న 4ఎస్.అస్రార్ హుస్సేన్,డి.ఆకాష్ బృందం ప్రథమ బహుమతిని,ఏఐ మోడల్ బిల్డింగ్ ఛాలెంజ్లో ఎస్.ఎం.డి అఫ్ఫాన్ ప్రథమ బహుమతి,కె.అష్ఫాక్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. అదేవిధంగా డిజిటల్ గేట్స్ అంశంపై నిర్వహించిన సర్క్యూట్ బిల్డింగ్ ఛాలెంజ్లో బి.సాత్విక్ ప్రథమ బహుమతిని సాధించారు.ఏఐ టూల్స్ వినియోగం ద్వారా సాంకేతిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించడం,మోడళ్లను అభివృద్ధి చేయడం,ఆలోచనలను సమర్థవంతంగా ప్రజెంట్ చేయడం వంటి నైపుణ్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఇలాంటి జాతీయస్థాయి సాంకేతిక సదస్సుల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం తోపాటు,పోటీ తత్వం,సృజనాత్మక ఆలోచనా విధానం,బృందంగా పనిచేసే నైపుణ్యాలను అభి వృద్ధి చేసుకోవచ్చునన్నారు.భవిష్యత్తులో కూడా కృత్రిమ మేధస్సు,మెషిన్ లెర్నింగ్,మోడల్ బిల్డింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో మరింతగా పరిశోధన చేసి వినూత్న ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని తెలిపారు.జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో పలు విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మిట్స్ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ ,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి,డాక్టర్ నిత్య మరియు అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

# తన రచనలతో సమాజాన్ని జాగృతం చేసిన గురజాడ

## - విశ్రాంత డీఎస్పీ,తెలుగుదేశం నేత సుకుమార్ బాబు ప్రశంసలు

మదనపల్లె (ప్రజా సీమ) :

ప్రముఖ కవి,రచయిత,సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలు పుంగనూరు బసవరాజా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు.కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత డీఎస్పీ,టీడీపీ సీనియర్ నాయకులు సుకుమార్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సుకుమార్ బాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలోని అనేక సామాజిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని తెలిపారు.గిడుగు రామ్మూర్తి పంతులుతో కలిసి సరళమైన తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన కృషి ప్రత్యేకమని కొనియాడారు.బాల్యవివాహాల నిర్మూలన,మహిళలకు విద్య అందించాలనే ఆలోచనలను అప్పట్లోనే ప్రజల్లోకి తీసుకెళ్లారని గుర్తుచేశారు.సమాజ సంస్కరణకు,తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన కృషిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సుకుమార్ బాబు సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళితోపాటు తెలుగు భాషా వికాసం అధ్యక్షులు రెడ్డెప్ప యాదవ్,వెంకటపతి,కళాశాల కమిటీ అధ్యక్షులు భక్తవత్సల రాజు,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# అవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలుగా బైరిశెట్టి నాగలక్ష్మీ

వేంపల్లె ప్రజాసీమ:



ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం అధ్యక్షురాలు గా బైరిశెట్టి నాగలక్ష్మి(బిజీఎస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ మేరకు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు కనకరాజు, ఉపాధ్యక్షుడు చిట్టెం రమేష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నాగవేణి, కడప జిల్లా అధ్యక్షుడు గూడూరు హరికృష్ణ, వేంపల్లె అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు సంయుక్త నిర్ణయంతో బైరిశెట్టి నాగలక్ష్మి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాష్ట్ర, జిల్లా, మండల అవోపా కార్యవర్గం శుభాకాంక్షలు తెలియజేశారు. బైరిశెట్టి నాగలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అవోపా మహిళా విభాగం అభివృద్ధికి కృషి చేస్తామని, అవోపా ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవలను ప్రజల్లో తీసుకెళ్లి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

# వరుస విజయాలతో విధ్యార్థిని తలారి తనుశ్రీ

## - మరోసారి రాష్ట్రస్థాయి చెస్ పోటిల్లో సత్తా

## - విధ్యార్థుల విజయాలే భవిష్యత్ కి పునాదులు

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తలారి తనుశ్రీ వరుస విజయాలు సొంతం చేసుకుంటూ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రస్థాయి చెస్ పోటిల్లో మరోసారి తన సత్తాను చాటుకుంది. అండర్ -16 బాలికల విభాగంలో వరుసగా నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచినట్లు కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 12న నంద్యాలలో జరిగిన చెస్ పోటిల్లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్, సెప్టెంబర్ 13న నెల్లూరులో జరిగిన పోటిల్లో 3వ ర్యాంక్ ని సాధించి తన ప్రతిభను, పాఠశాల విశిష్టతను చాటి చెప్పిందన్నారు. చదువుతో పాటు చెస్ వంటి మేధో క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థుల విజయాలే భవిష్యత్ కి పునాదులను క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. అలాగే మరిన్ని విజయాలు సొంతం చేసుకుని మంచి గుర్తింపు సాధించాలని విద్యార్థిని పట్ల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డి ఆకాంక్షించారు. అలాగే తనుశ్రీ విజయాలకు సహకరిస్తున్న తల్లిదండ్రులు, కోచ్, ఉపాధ్యాయులకు అభినందించారు.



# విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ల సాధనకు శాస్త్రి కృషి అభినందనీయం

## - జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ ప్రశంసలు

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా కేంద్రం,మదనపల్లె యూనిట్ ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జనరల్ సెక్రెటరీ డాక్టర్ నైనారి మునిగోపాల కృష్ణ,ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ల సాధనకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రిని అభినందించారు.ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు,జిల్లా అధ్యక్షులు సోమ సుందర రావు,జనరల్ సెక్రెటరీ ప్రసాద్ రావు,అసోసియేట్ ప్రెసిడెంట్ నరసింహమూర్తిలతో కలసి ఎపి రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రికి ముని గోపాల కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన రెండు డిఆర్ నెస్ అలవెన్సులు ప్రకటించిన ఎపి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.బొప్పరాజు వెంకటేశ్వర్లు అమరావతి జేఏసీ చైర్మనుగా చేసిన కృషి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు శాస్త్రి చొరవతో రెండు డిఆర్ నెస్ అలవెన్స్ సాధించుకున్నామని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన రాష్ట్ర అసెంబ్లీ సమావేశ భవనాన్ని ప్రారంభించినందుకు రాష్ట్ర అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు.జిల్లా అధ్యక్షులు సోమసుందర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు సమస్యల పరిష్కారంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.డాక్టర్ ఎన్.ముని గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రిని అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లె రావాలని ఆహ్వా నించామన్నారు.తమ ఆహ్వానంపైన రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి అంగీకరించి సుముఖత వ్యక్తం చేశారన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ - ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు ప్రజాసీమ:**

పీలేరు నియోజకవర్గాన్ని ప్రజా సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. కలికిరి మండలం నగిరిపల్లిలోని తన కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడతో పాటు ఇతర మండలాల నుంచి ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే స్వయంగా విని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రధానంగా రైతుల పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ పెండింగ్, తాగునీటి సమస్యలు, రోడ్ల మరమ్మతులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం పథకంలో అర్హుల పేర్ల చేర్పు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అలాగే పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూ సమస్యలు, సర్వే సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వంటి సమస్యలపై కూడా ప్రజలు వినతులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీ పడబోమని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.



# ప్రభుత్వం సత్వరమే మధ్యంతర భృతిని ప్రకటించాలి

**- ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి,మధుసూదన డిమాండ్**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి,పోకల మధుసూదనలు డిమాండ్ చేశారు.వాల్మీకిపురం మండలంలోని ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయుల పిఆర్సి గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటిన ఇప్పటి వరకు కొత్త పిఆర్సి కమిటీని నియమిస్తామని ముఖ్య మంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ఐ.ఆర్ ప్రకటించకపోవడం ఆందోళనకరమన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు రెండున్నర ఏళ్ల క్రితమే ఐఆర్ ప్రకటించిందని గుర్తుచేశారు.ఏపీలో మాత్రం ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు.వెంటనే పిఆర్సి కమిటీకి చైర్మన్ నియమించి,టైం బౌండుతో కూడిన పిఆర్సి కమిటీని నియమించి ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగులకు సరెండర్ లీవ్ బకాయిలు పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.కేవలం 2022 సంవత్సరానికి మాత్రమే ఇస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు.ఉద్యోగులు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న సరెండర్ లీవ్ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ మురళీ కుమార్ జిల్లా నాయకులు ఎల్లారెడ్డి,మోహన్ నాయుడు,శంకర్ రెడ్డి,సివి రమణ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వనజ,బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# వెలుగు సంస్థలో ఘనంగా ప్రపంచ అల్జీమర్స్ డే

**- ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ గోపాళం శివన్నారాయణ**

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు వృద్ధాశ్రమం నందు ప్రపంచ అల్జీమర్స్ డేని సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ గోపాళం శివన్నారాయణ ఎం.డి,డీఎం ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గోపాళం శివన్నారాయణ మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి నాలుగు దశలలో ఉంటుందనీ,అల్జీమర్స్ వ్యాధిలో మెదడు కణాలు దెబ్బతినడం ప్రారంభమవుతాయని,ఇది ఒక దీర్ఘకాలిక న్యూరో డిజనరేటివ్ వ్యాధి అని,ఇది నెమ్మదిగా ప్రారంభమై కాలం గడిచే కొద్ది తీవ్రప్రభావాన్ని చూపిస్తుందని,సాధారణంగా 65 ఏళ్లు పైబడిన వారిలో కనిపించే వ్యాధిఅని జ్ఞాపకశక్తి మందగించడం దీని ముఖ్య లక్షణమని వివరించారు.అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న ఎవరైనా వారు తమ జీవితాల్లో ముఖ్యమైన వ్యక్తులను మరిచిపోతారు.వ్యక్తిత్వ మార్పులకు గురి అవుతారని,అల్జీమర్స్ వ్యాధిలో మెదడు కణాలు క్షీణించి చనిపోయి జ్ఞాపకశక్తి,మానసిక పనితీరులో మార్పులు వస్తాయని వివరించారు.దీని సమస్య తగ్గించుకోవడానికి శారీరకంగా,మానసికంగా,ముఖ్యంగా చెస్,క్యారమ్స్ వంటి ఆటలు ఆడటం వలన అల్జీమర్స్ వ్యాధిని కొంతవరకు నివారించవచ్చని,దీనికి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో ఉండాలనీ వివరించారు.అనంతరం వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మతిమరుపు అనేది లైఫ్ స్టైల్ చెంజెస్ ద్వారా తగ్గించుకోవచ్చునని శరీరానికి ఆహారం ఏవిధంగా అవసరమో,మెదడకు కూడా తగిన విశ్రాంతి,యోగ,మెడిటేషన్ అవసరమని దీని ద్వారా మతిమరుపును తగ్గించుకోవచ్చుని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి,సోషల్ వర్కర్ యం.గీత,వార్డెన్ స్వీటీ,నర్స్ యం.శాంతి,వెలుగు సిబ్బంది మరియు వృద్ధులు పాల్గొన్నారు.




# 600 ఎకరాల ప్రభుత్వ భూములపై ఎమ్మెల్యే మౌనం వీడాలి

**ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటా.**

**లోకాయుక్త ఆదేశాలు అమలు చేయకపోతే ఉద్యమం ఉధృతం : మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య ధ్వజం....**

**మదనపల్లె ప్రజాసీమ :**

పీలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, అక్రమ లేఅవుట్లు, ఆయిల్‌సీడ్ భూముల వ్యవహారాలు, దళితులకు కేటాయించిన భూముల పరిరక్షణపై ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి మౌనం వీడాలని మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములపై పోరాడిన ఎమ్మెల్యే.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే అంశాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.మదనపల్లె సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రయ్య మాట్లాడుతూ.. పీలేరు పరిధిలో సుమారు 600 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలపై గతంలో రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. బోడుమల్లవారిపల్లి, దొడ్డిపల్లి, ముదుపుల, వేముల, ఎర్రగుంట్లపల్లి తదితర ప్రాంతాల్లో భూములపై సర్వేలు జరిగినట్లు చెప్పారు.ఈ వ్యవహారంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు చంద్రయ్య పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ఆయన “అప్పట్లో లేవనెత్తిన 600 ఎకరాల ప్రభుత్వ భూముల అంశంపై ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు?” అని నిలదీశారు.వైసీపీ--టీడీపీ మధ్య లోపాయికారీ ఒప్పందమా?ప్రభుత్వ భూముల అంశంపై గతంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న రాజకీయ పక్షాలు ప్రస్తుతం ఈ వ్యవహారంపై మౌనం వహిస్తున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని చంద్రయ్య అన్నారు. అయితే ఈ ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందుంచాలని, లేదంటే సంబంధిత భూములపై అధికారిక రికార్డులతో వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.“ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములను కాపాడుతామని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే భూములపై ఎందుకు నోరు మెదపడం లేదు? 600 ఎకరాల భూముల విషయంలో ఇప్పటివరకు ఏం జరిగింది? ఎవరిపై చర్యలు తీసుకున్నారు? ఎంత భూమి ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది? ప్రజలకు సమాధానం చెప్పాలి” అని చంద్రయ్య డిమాండ్ చేశారు.లోకాయుక్త ఆదేశాలు కాగితాలకే పరిమితమా?పీలేరు మండలం, పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్లు, భూముల వినియోగ మార్పిడి, ఆక్రమణలకు సంబంధించి లోకయుక్తలో ఫిర్యాదులు నమోదై విచారణ జరిగినట్లు




చంద్రయ్య తెలిపారు.2022 ఏప్రిల్‌లో డిప్యూటీ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్), డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్) స్థాయిలో నివేదికలు సమర్పించారని పేర్కొన్నారు. పీలేరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 93లో 0.050 ఎకరాల భూమికి సంబంధించిన ఆక్రమణ, ప్రహరీ గోడ నిర్మాణ అంశం విచారణలో ప్రస్తావించబడిందన్నారు. దొడ్డిపల్లి పరిధిలోని పలు సర్వే నంబర్లలో లేఅవుట్లకు సంబంధించిన అనుమతుల అంశాలు కూడా పరిశీలించబడ్డాయని తెలిపారు.“లోకాయుక్త విచారణ జరిగి అధికారులకు ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా చర్యలు ఎందుకు కనిపించడం లేదు? లోకాయుక్త ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయా? అధికారులు వెంటనే రికార్డులను బయటకు తీసి వాస్తవాలను ప్రజలకు చెప్పాలి” అని చంద్రయ్య డిమాండ్ చేశారు.దళితుల ఇళ్లపై కఠినత్వం.. ఆక్రమణలపై మౌనం ఎందుకు?కేవీపల్లి మండలంలో దళిత కుటుంబాలకు కేటాయించిన భూముల్లో ఇళ్ల నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పుడు, ప్రభుత్వ భూములు, చెరువులు, దళితుల స్మశానవాటికలు ఆక్రమణకు గురయ్యాయనే ఆరోపణలపై కూడా అదే స్థాయిలో చర్యలు తీసుకోవాలని చంద్రయ్య అన్నారు.“పేద దళితుడు ఇల్లు కట్టుకుంటే నిబంధనలు గుర్తొస్తాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో మాత్రం అదే నిబంధనలు ఎందుకు కనిపించవు? చట్టం అందరికీ సమానంగా అమలు చేయాలి” అని అన్నారు.అంబేద్కర్ భవనానికి కేటాయించినట్లు చెబుతున్న ప్రభుత్వ స్థలం, ఆయిల్‌సీడ్ భూములు, దళితులకు కేటాయించిన భూములు తదితర అంశాలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని కోరారు.చర్యలు లేకపోతే ఉద్యమంపీలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపై జిల్లా యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలని చంద్రయ్య డిమాండ్ చేశారు.600 ఎకరాల ప్రభుత్వ భూముల అంశం, లోకాయుక్త విచారణలు, అక్రమ లేఅవుట్లు, ఆయిల్‌సీడ్ భూములు, దళితుల భూముల పరిరక్షణపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే దళిత, గిరిజన, బహుజన సంఘాలను ఐక్యం చేసి పీలేరు నియోజకవర్గంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య హెచ్చరించారు.

# పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలోకి 32 మంది వైసీపీ నేతలు









## పిఠాపురంలో భారీగా చేరికలు

**పిఠాపురం : (ప్రజా సీమ )**

పిఠాపురం వేదికగా జనసేన పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 32 మంది ముఖ్య నాయకులు జనసేన పార్టీలో చేరారు. కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి బాబు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు పార్టీని వీడి జనసేనలో చేరారు. మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సామర్లకోట మాజీ మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్లు కనకాల మహాలక్ష్మి, కనకాల సుబ్రహ్మణ్యం తదితరులు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు జనసేన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేనలో చేరిన వారిలో వరుపుల సుబ్బారావు, పాంపన రామకృష్ణ, నెక్కంటి సాయి ప్రసాద్, విజ్జపు రాజశేఖర్, త్సాలికి భాస్కరరావు, కొట్టి కిషోర్ పవన్, గుర్రాల మార్త, వాసంశెట్టి గంగ, అరెళ్ల వీర రాఘవులు, నీలంసెట్టి అమ్మాజీ, కట్టా రాజాబాబు, యండమూరి విజయలక్ష్మి, చింత శ్రీనివాసరావు, కోటి మల్లిబాబు, కురమదాస్ సతీష్ కుమార్, గంగిరెడ్డి అరుణ, గంగిరెడ్డి కృష్ణమూర్తి, చల్లపల్లి వెంకట సత్యనారాయణ, వేగి సత్యనారాయణ, చాడలాడ రాజ్ కుమార్, జోకా వెంకట శ్రీనివాస్ విజయ్ కుమార్, వి.వి.ఎస్. సూరిబాబు, వి. రాజాబాబు, గాబు కృష్ణ, కనకాల మహాలక్ష్మి, కనకాల సుబ్రహ్మణ్యం, తాడి రాజశేఖర్, జల్లో డేవిడ్, పిన్నింటి రాము, పల్లె రాజు, నదిమింటి వెంకటరాజు, బి. అలీషా తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే శ్రీ పంతం నానాజీ, చైర్మన్లు వేగుళ్ల లీలాకృష్ణ, తలాటం సత్య, తోట సుధీర్, పీఏసీ కమిటీ సభ్యులు పెండెం దొరబాబు, ఓదూరి కిషోర్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రివర్యులు సవితమ్మను కలిసిన మాజీ మార్కెట్ చైర్మన్ జవహర్ భాష.

**సిద్ధవటం ప్రజా సీమ**

కడప జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సవితమ్మను సోమవారం పెనుగొండ నందు తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశామని టిడిపి సీనియర్ నేత మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ సయ్యద్ జవహర్ భాష తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం లోని తన నివాసంలో మాట్లాడుతూ పార్టీ బలోపితంపై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లామని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారని తెలిపారు రాబోయే ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల కోసం కృషి చేయాలని మంత్రి సూచించినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ కో కన్వీనర్ శంకర్ రెడ్డి,టిడిపి యువ నేతలు, బత్తిన వెంకటయ్య, కంభం సుబ్బారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# రక్తదానంతో జీవితాన్ని ప్రసాదించండి

## - రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన

**వేంపల్లె ప్రజాసీమ:**

రక్తదానంతో ఒక జీవితాన్ని ప్రసాదించాలని, యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం ఆ కళాశాలలోని విధ్యార్ధులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అలాగే బ్లడ్ గ్రూప్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రక్తదానం, బ్లడ్ గ్రూప్ ఉపయోగాల పట్ల స్పష్టంగా వివరించారు. వేంపల్లె సిఐ నరసింహులు రక్తదానం, సైబర్ క్రైమ్, మహిళా బద్రత, శక్తి యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వైస్ ప్రిన్సిపాల్ సాజీయ బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు కుమార్ రాజా, జనార్ధన్, అధ్యాపకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# రాజంపేట పట్టణ సమస్యలపై డాక్టర్ నవీన్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన

## ప్రజలు, వ్యాపారులతో ముఖాముఖి

**రాజంపేట (ప్రజా సీమ):**

రాజంపేట పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానిక టీ స్టాల్ వద్ద ప్రజలు, పలువురు ప్రముఖులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై పట్టణంలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడును డాక్టర్ నవీన్ కుమార్‌కు వెళ్లబోసుకున్నారు. పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మురుగునీటి సమస్యతో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని, దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన రాజంపేట కూరగాయల మార్కెట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు మాట్లాడుతూ.. వర్షం వచ్చినప్పుడు నీరు బయటకు పోయే మార్గం లేక మార్కెట్ ప్రాంగణమంతా మోకాల్లోతు నీరు, బురదమయంగా మారుతోందని తెలిపారు. దానికితోడు ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందని, కొనుగోలుదారులు మార్కెట్‌లోకి నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని వాపోయారు. వ్యాపారాలు సాగక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఈ సమస్యలను పరిశీలించిన అనంతరం డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం, మార్కెట్ ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కార మార్గాలు కనుగొనేందుకు కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.









# రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని ఓసి మహిళకు కేటాయించాలి

## జిల్లా ఇంచార్జ్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కౌన్సిలర్ గజ్జల శ్వేతా రెడ్డి

**రాజంపేట (ప్రజా సీమ):**

రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని ఓసి మహిళ, జనరల్ కు కేటాయించాలని సాయి నగర్ కౌన్సిలర్ గజ్జల శ్వేతారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో జిల్లా ఇంచార్జ్, బీసీ వెల్ఫేర్, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవితమ్మ ను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గజ్జల శ్వేతారెడ్డి మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని ఓసి మహిళ, జనరల్ కు కేటాయిస్తే రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేస్తామని తెలియజేశారు. రాజంపేట మున్సిపాలిటీలో ఉన్నటువంటి 32 వార్డుల్లో అన్ని వర్గాల ప్రజలు తమను ఆదరిస్తారని తెలియజేశారు. రెడ్డి సామాజిక వర్గంతో పాటు కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లతో పరిచయాలు ఉన్నాయని తెలిపారు. మొదటి నుండి తమ కుటుంబానికి మున్సిపాలిటీలో ప్రత్యేకమైన గుర్తింపు ఉందని పేర్కొన్నారు. దీనిపై మంత్రి సవితమ్మ సానుకూలంగా స్పందిస్తూ.. పరిశీలిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీరి వెంట టిడిపి యువ నాయకులు రాఘవేంద్ర కుమార్ పాల్గొన్నారు.



# వేంపల్లెలో దసరా ఉత్సవాలకు స్తంభ మహోత్సవం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు అక్టోబర్ 11వ తేది నుండి నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో ఉదయం 9.15 నిమిషాలకు పందిరి పూజా మహోత్సవం నిర్వహించారు. ముందుగా గణపతి పూజ భూమి పూజ చేసి అనంతరం శుభముహూర్తంలో దసరా ఉత్సవాల పందిరికి స్థంభ పూజా చేసి స్థంభస్థాపన చేశారు.అక్టోబర్ 11వతేది నుండి 22వతేది వరకు 12రోజుల పాటు దసరా ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం,ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మంత్రులతో శనివారపు మోహన్ రెడ్డి

**సిద్ధవటం ప్రజా సీమ**

నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో భారీ ఎత్తున రూ. 53.25 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపనల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని "అభివృద్ధి జాతర" గా పిలిచారు.

ఆత్మకూరులో అభివృద్ధి జాతర: మంత్రులు, నేతల సమక్షంలో రూ. 53.25 కోట్ల పనులకుశ్రీకారం ఆత్మకూరు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజవర్గం అభివృద్ధి పనుల పండుగ అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖ రాజకీయ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర కార్యదర్శి ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు (అబ్సర్వర్ ) శనివారపు మోహన్ రెడ్డి మంత్రులతో కలిసి చురుగ్గా పాల్గొని, పలు చోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.మొత్తం కేటాయింపులు: నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 53.25 కోట్ల విలువైన పనులకు అధికారికంగా ఆమోదం లభించింది.ప్రారంభోత్సవాలు: దాదాపు రూ. 10 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తయిన పలు కీలక ప్రాజెక్టులను మంత్రుల బృందం ప్రారంభించింది.శంకుస్థాపనలు: రూ. 35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సరికొత్త మౌలిక వసతుల పనులకు మంత్రులు పునాదిరాళ్లు వేశారు.టిడ్కో కాలనీ వసతులు: రూ. 75 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి దేవాలయం, కళ్యాణ మండపం, నక్షత్ర వనంతో పాటు... కాలనీ వాసుల కోసం రూ. 1 కోటి వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ మరియు చెరో రూ. 3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు.రవాణా సౌకర్యాలు: నెల్లూరుపాలెం ఆంజనేయస్వామి గుడి నుండి ఆత్మకూరు వరకు నిర్మించనున్న 2.1 కిలోమీటర్ల మేర ఫోర్ లేన్ రహదారి పనులకు ప్రాధాన్యత ఇచ్చారు.హాజరైన ముఖ్య నేతలు: స్థానిక మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ,గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర గారు ఈ పనులను లాంఛనంగా ప్రారంభించారు.ఎమ్మెల్సీలు మరియు ఆత్మకూరు అబ్జర్వర్ శనివారపు మోహన్ రెడ్డి తదితర కూటమి ముఖ్య నేతలు, అధికారులు ఈ జాతరలో భాగస్వాములయ్యారు.కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు మంత్రులు, నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# పేదల కంటి వెలుగుకు -'లిటిల్ స్టార్స్'రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేయూత

## ఉచిత కంటి వైద్య శిబిరంలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తింపు

**పిఠాపురం: (ప్రజా సీమ )**

పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సోమవారం లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ దృష్టి కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ టి. కరుణ్ రాజు (కామేశ్వరరావు) మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పేద, నిరుపేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి సమస్యలకు వైద్యం పొందలేని వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.దృష్టి కంటి ఆసుపత్రి వైద్యురాలు డా. ఎన్. మాధురి ఆధ్వర్యంలోని వైద్య బృందం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించింది. పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమున్న సుమారు 20 మందిని గుర్తించి, తదుపరి చికిత్స కోసం కాకినాడ దృష్టి కంటి ఆసుపత్రికి తరలించినట్లు ట్రస్ట్ చైర్మన్ తెలిపారు. శిబిరానికి సహకరించిన దృష్టి కంటి ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మన ఊరు--మన బాధ్యత అధ్యక్షుడు కొండేపూడి శంకర్రావు, సెక్రటరీ నగేష్, పి.సి.పి.డబ్ల్యూ అధ్యక్షులు డి.ఎ. విక్టర్ బాబు, కె.యస్.యస్.వి. ప్రసాద్, కొమానపల్లి అప్పారావు, ట్రస్ట్ అడ్వైజర్ ఎం. ఎలియా, ట్రస్ట్ డైరెక్టర్ టి. బ్యులాగ్రేస్, ఆర్.ఎస్.ఎస్. నాయకులు టి. రామచంద్రరావు, ట్రస్ట్ సభ్యులు జి. గణేష్, పి. ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు

## మహాకవి ఆశయాలను స్మరించుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:**

పుల్లంపేట మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో విద్యార్థులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో నవయుగానికి నాంది పలికిన మహానుభావుడని అన్నారు. సమాజంలోని బాల్యవివాహాలు, వెట్టి చాకిరి, అంటరానితనం వంటి సామాజిక దురాచారాల నిర్మూలనకు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. "దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్" అనే సందేశంతో మానవతా విలువలను చాటిచెప్పిన గొప్ప కవిగా గురజాడ చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.గురజాడ అప్పారావు సాహిత్యం నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని, విద్యార్థులు ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు గురజాడ జీవిత విశేషాలను తెలుసుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.



# మదనపల్లె తాలూకా పీఎస్ సిఐగా మహమ్మద్ రఫీ

## - శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్ సిఐగా మహమ్మద్ రఫీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ పనిచేస్తున్న సిఐ కళా వెంకటరమణ బి.కొత్తకోటకు బదిలీపై వెళ్లారు.రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ రఫీ తాలూకాకు బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణకు తొలి ప్రాధాన్యతనిస్తామన్నారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తద్వారా బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు.ప్రజలు అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని హితవు పలికారు.జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు పనిచేసి పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.గతంలో ఒకటి,రెండవ పట్టణ సీఐగా పనిచేసిన అనుభవం తనకు దోహదపడుతుందన్నారు.తాలూకా సిఐగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ రఫీకి పోలీస్ శాఖ అధికారులు,సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# 'ది పారడైజ్'కు సెన్సార్ షాక్.. 21 కట్స్‌తో 'ఏ' సర్టిఫికెట్, ఫైనల్ రన్‌టైమ్ ఇదే



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన అత్యంత ఆసక్తికరమైన చిత్రం 'ది పారడైజ్'. 'దసరా' తర్వాత ఈ ఇద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రా అండ్ రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న వేళ సెన్సార్ ప్రక్రియకు సంబంధించిన తాజా సమాచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. అంతేకాకుండా సినిమాలోని పలు సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మొత్తం 21 మార్పులు, కట్స్ సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాలోని కొన్ని హింసాత్మక సన్నివేశాలు, తీవ్ర అభ్యంతరకరమైన పదజాలం, హీరో పాత్ర చేతిపై కనిపించే వివాదాస్పద టాటూపై సెన్సార్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. సెన్సార్ సూచనల మేరకు చిత్రబృందం కొన్ని హింసాత్మక సన్నివేశాలను కుదించడంతో పాటు, కొన్ని సంభాషణలను మ్యూట్ చేసినట్లు తెలుస్తోంది. అలాగే అవసరమైన హెచ్చరికలను కూడా సినిమాలో చేర్చినట్లు సమాచారం. ఈ మార్పుల అనంతరం 'ది పారడైజ్' తుది నిడివి 174 నిమిషాలుగా, అంటే 2 గంటల 54 నిమిషాలుగా ఖరారైంది. తొలుత ఈ సినిమా నిడివి 2 గంటల 49 నిమిషాలుగా ఉండేలా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రణాళిక రూపొందించారు. అయితే సెన్సార్ సూచించిన మార్పుల కారణంగా తుది నిడివిలో స్వల్ప మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక సెన్సార్ బోర్డు 21 కట్స్ సూచించినట్లు వస్తున్న వార్తలపై నాని అభిమానుల్లో చర్చ మొదలైంది. 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి చేస్తున్న చిత్రం కావడంతో 'ది పారడైజ్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా రా యాక్షన్, బలమైన కథాంశం, నాని పాత్ర ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని చిత్రబృందం ఇప్పటికే చెప్పుకొచ్చింది. అణచివేతకు గురైన ఓ సమాజం తమ హక్కుల కోసం తిరుగుబాటు చేసే నేపథ్యంలో ఈ పీరియాడిక్ మాస్ డ్రామాను రూపొందించినట్లు సమాచారం. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. మరోవైపు ఎలాంటి అధికారిక ట్రైలర్ విడుదల చేయకుండానే టీజర్, పాటలతో సినిమాపై భారీ ఆసక్తిని పెంచడం 'ది పారడైజ్'కు ప్రత్యేక ఆకర్షణగా మారింది. నాని కెరీర్‌లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. తెలుగు, హిందీ, తమిళం సహా పలు భాషల్లో ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# సుకుమార్ శిష్యులకు 'ద్వితీయ విఘ్నం' టెన్షన్.. బుచ్చిబాబు తర్వాత శ్రీకాంత్ ఓదెల వంతు

టాలీవుడ్‌లో దర్శకుడు సుకుమార్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన వద్ద పనిచేసి దర్శకత్వంలోకి వచ్చిన పలువురు యువ దర్శకులు తమదైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా సహజత్వం, రా అండ్ రస్టిక్ కథనాలు, బలమైన భావోద్వేగాలతో సినిమాలను తెరకెక్కించడం సుకుమార్ శిష్యుల పనితీరులో కనిపించే అంశాలుగా మారాయి. అయితే తొలి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకులు రెండో సినిమాతో అదే స్థాయిలో మెప్పిస్తారా? అనే చర్చ ఎప్పటి నుంచో సినీ వర్గాల్లో ఉంది. ప్రస్తుతం ఈ చర్చ సుకుమార్ శిష్యులు బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల చుట్టూ తిరుగుతోంది. తొలి సినిమాలతో మంచి విజయాలు అందుకున్న ఈ ఇద్దరు దర్శకులు తమ రెండో చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. బుచ్చిబాబు సానా 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం దక్కింది. భారీ అంచనాల మధ్య విడుదలైన 'పెద్ది'లో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే కథనం, కొన్ని పాత్రల రూపకల్పన, నాటకీయత విషయంలో దర్శకుడిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర విషయంలో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ అంశంపై బుచ్చిబాబు కూడా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. అయితే బాక్సాఫీస్ పరంగా కూడా 'పెద్ది'పై విడుదలకు ముందు ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ఫలితం రాలేదనే చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు రెండో సినిమాతో ఎదుర్కొన్న అనుభవాన్ని సినీ వర్గాలు 'ద్వితీయ విఘ్నం'గా ప్రస్తావిస్తున్నాయి. ఇక ఇప్పుడు మరో సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల రెండో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'దసరా'తో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల.. తొలి సినిమాతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. లపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు నానితోనే మరోసారి 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కించారు. దీంతో ఈ సినిమా ఆయన కెరీర్‌లో అత్యంత కీలకంగా మారింది. 'దసరా'లో గ్రామీణ నేపథ్యంలో రా అండ్ రస్టిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో మరింత భారీ స్థాయి కథను తీసుకున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో నాని పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. అయితే తొలి సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత రెండో సినిమాతో దర్శకుడి పరిధి, ఆలోచనా విధానం మరింత విస్తరించడం సహజం. అదే సమయంలో అంచనాలు కూడా భారీగా పెరుగుతాయి. ఈ కారణంగానే తొలి విజయాన్ని రెండో సినిమాతో కొనసాగించగలరా? అనే చర్చ దర్శకుల కెరీర్‌లో ఆసక్తికర అంశంగా మారుతుంది.

# టొరంటోలో అవార్డు గెలుచుకున్న నాగాలాండ్ చిత్రం అంగ్

తేజ రియో మొదటిసారి రూపొందించిన ఫీచర్ ఫిల్మ్ అంగ్. నాగాలాండ్ నేపథ్యంగా ఈ సినిమాను తీశారు. తొలి సినిమాతోనే అంతర్జాతీయ అవార్డు అందుకుని శభాష్ అనిపించుకుంటున్నారు తేజ రియో. ఈ సినిమా టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్లాట్‌ఫామ్ అవార్డును గెలుచుకుంది. అంతేకాదు నేరుగా 2027 ఆస్కార్ బరిలో చోటు సంపాదించుకుంది. ఈ ఏడాది ప్లాట్‌ఫామ్ విభాగానికి ఎంపికైన ఏకైక భారతీయ సినిమాగా అంగ్ నిలవడం విశేషం. అయితే ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారతదేశం తరఫున 'గోంధల్' సినిమా ఎంపికయ్యింది. గోంధల్ చిత్ర దర్శకుడు సంతోష్ దావ్‌ఖర్ గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. కానీ అంగ్ సినిమా నేరుగా ఆస్కార్‌లో నిలిచింది. అంగ్ సినిమాను 1960ల నాటి నాగాలాండ్ నేపథ్యంతో తీశారు. భారత్–బర్మా సరిహద్దు సమీపంలోని మారుమూల గ్రామంలో ఈ కథ నడుస్తుంది. దీనిలో కోన్యాక్ (ఖశీఖుఎఐ) తెగ నాయకుడు, చిన్నపిల్లవాడు అయిన అతని కుమారుడు చుట్టూ కథ సాగుతుంది. గ్రామంలో మొదలవుతున్న మార్పుల నేపథ్యంలో అవసరమైన వాటి కోసం విడిగా ఉండటం, ఇల్లును వదిలిపెట్టడం వంటి అంశాలపై తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగం గుండెలకు హత్తుకుంటుందని డైరెక్టర్ తేజ రియో పేర్కొన్నారు. దీనిలో నాగా ఆదివాసీలనే నటులుగా తీసుకున్నామని, బాఫ్టా అవార్డు విజేత డగ్లస్ హెన్‌షాల్ కూడా తోడయ్యారని వెల్లడించారు. నేను పుట్టిన ప్రాంతం, నా ప్రజలు, సంస్కృతి పట్ల ఉన్న ప్రేమతోనే ఈ సినిమా తీశానని రియో అన్నారు. పురోగతి పేరుతో సంప్రదాయ జీవన విధానాలు ఎలా కనుమరుగవుతున్నాయో అంగ్ సినిమాలో చూపించామని వివరించారు.

ఈ ఏడాది ప్లాట్‌ఫామ్ విభాగంలో పన్నెండు చిత్రాలు పోటీపడ్డాయి. వాటిలో అంగ్ మాత్రమే ఏకైక భారతీయ సినిమా. ఈ సినిమాకు లభించిన అవార్డు కింద నగదు ఇరవై వేల కెనడియన్ డాలర్లు సుమారు రూ. 13.86 లక్షలు లభించాయి. ఆస్కార్స్‌కు నేరుగా వెళ్లే మార్గాల్లో ఆరు ఫెస్టివల్ అవార్డుల్లో ప్లాట్‌ఫామ్ అవార్డు ఒకటని వర్గాలు వెల్లడించాయి. కాబట్టి అంగ్ సినిమా స్వదేశం నుంచి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదని తెలిపాయి.




# ఆ సీక్రెట్ తెలిసిపోయింది.. బన్నీ, అట్లీ 'రాకా' టీం గిన్నీస్ వరల్డ్ రికార్డ్




ఐకాన్ స్టార్, అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వస్తున్న చిత్రం రాకా. ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఇటీవలే అట్లీ టీం '37' నంబర్‌తో ఓ పోస్టర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నంబర్ వెనుకున్న సీక్రెట్ ఏంటనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేసి ప్రేక్షకులు, అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచేశారు. ఇప్పుడు అట్లీ బర్త్ డే సందర్భంగా ఈ సీక్రెట్ ఏంటో క్లారిటీ ఇచ్చేశారు. రియల్ టైం మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఉపయోగించి 37 మందిని చిత్రీకరించి.. విజువల్ ఎఫెక్ట్స్‌లో చేసిన ఒక కొత్త ప్రయోగానికి రాకా బృందం గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించింది. గతంలో రియల్ టైంలో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఉపయోగించి 19 మందిని చిత్రీకరించిన రికార్డు ఉండగా.. రాకా టీం తాజాగా 37మందితో ఆ రికార్డును అధిగమించింది. అల్లు అర్జున్, అట్లీ ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందుకుంది. భారతీయ సినిమా చరిత్రలో అరుదైన ఫీట్‌ను నమోదు చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది అట్లీ అండ్ బన్నీ టీం. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీలో దీపికా పదుకొనే, రష్మిక మందన్నా, మృణాళ్ ఠాకూర్, జాన్వీకపూర్‌తోపాటు పలువురు కీలక నటీనటులు మెస్మరైజ్ చేయబోతున్నారు. మొత్తానికి విడుదలకు ముందే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కి సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తున్నాడు అట్లీ. మరి ఈసినిమా బాక్సాఫీస్ రికార్డు ఏ స్థాయిలో బద్దలు కొడుతుందనేది చూడాలి.



# 'ఆదర్శ కుటుంబం' నుంచి 'నారాయణమ్మ' ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి పాటైన 'నారాయణమ్మ' సాంగ్‌ను సెప్టెంబర్ 22న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై ప్రేక్షకుల్లో మరియు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త సినిమాలు చూడండిఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి, నివేతా థామస్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# కృతి శెట్టికి పుట్టినరోజు కానుక.. 'జనవరి 12 విడుదల'లో దీపుగా బేబమ్మ

కృతి శెట్టి పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల' చిత్రబృందం ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సంక్రాంతి వినోదాత్మక చిత్రంలో కృతి శెట్టిని 'దీపు'గా పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కృతి శెట్టి సంప్రదాయ హాఫ్ శారీలో కనిపించారు. ఊదా, గులాబీ రంగులతో కూడిన దుస్తుల్లో ఆమె ఎంతో అందంగా దర్శనమిచ్చారు. చారిత్రక కట్టడం బ్యాక్ గ్రౌండ్‌లో కనిపిస్తుండగా.. చిరునవ్వుతో కృతి శెట్టి ఇచ్చిన పోజ్ పోస్టర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ ద్వారా ఆమె పోషిస్తున్న పాత్ర చాలా సంప్రదాయబద్ధంగా ఉంటుందని క్లారిటీ వచ్చింది. 'జనవరి 12 విడుదల' చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ కూడా సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇటీవల వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన హాస్యభరితమైన వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. కొత్త సినిమాలు చూడండి షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్ వా ట డి యో వా స్ సమర్పిస్తున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ చిత్రాన్ని జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా ఘనం గా థియేటర్లలో విడుదల చేసేం దుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma